
# ఇరవై నాలుగ్గంటలూ

బారెడు పొద్దెక్కేదాకా సారథి కమ్మని కునుకు తీసే అవకాశం లేకుండానే భార్య, పాలవాడి సంవాదంతో నిద్రచెడింది. వాళ్ల సంభాషణ బుర్రలోకి ఎక్కేకొద్దీ నిద్రమత్తు క్షణాల్లో దిగిపోయింది.




"అదేంటయ్యా! లీటరు పదకొండు చేసి నాలుగు నెలలన్నా కాలేదు. అప్పుడే మళ్లీ రూపాయి పెంచమంటావేంటి?" అరుస్తోంది కావేరి.

"ఇవ్వాళ ఏ వస్తువు రేట్లు నిలకడగా వుంటున్నాయమ్మా! మొన్నటికి మొన్న గ్యాసు యాభైరూపాయలు పెంచారు. కొనటం మానేస్తారా?" పాలవాడి ఆర్గ్యుమెంట్!

"పోసే పాలేమన్నా సరిగా పోస్తావా అంటే అదీలేదు. ఒకరోజు బాగుంటే ఒక రోజు బాగోవు!"

"ఇంకేం పిండి పోయించుకొంటానంటారా? మాబాగా పోయించుకోండి. మూడువేల అడ్వాన్సు. పదిహేను రూపాయిలు. పావులీటరు నురగ కింద తరుగు పోద్ది. అటూ ఇటూ లెక్కలు గడ్తే మేవే నయం".

"దేనికైనా న్యాయం వుండాలి. తేరగా డబ్బులు పోగేసుకోవాలన్న ఆరాటం తప్పితే మరో ఆలోచన వుంటేగా?" కావేరి దెప్పిపొడుపు.

"ఏమ్మా! మా కష్టానికి మాత్రం విలువ లేదా? చీకటేళ మూడు గంటలకల్లా లేచి ఇంటింటికీ తిరిగి పాలు పిండించుకొని, క్యాను వేసుకొని రైళ్ల మీద పరుగులు దోలి కాఫీ వేళకల్లా మీ ఇళ్ల ముందుండాలంటే మాటలతో అవుద్దామ్మా! పాడున్న మారాజులు రూపాయి పెంచేరంటే నేనూ పెంచాలి. అదేవంటే ఆళ్లూ అంటున్నారు, గేదెలకు నీళ్లు తాపి పాలు పితుక్కొంటున్నామా అనీ. ఫస్టునుండి పన్నెండు రూపాయిలు. మీ ఇష్టం కావాలంటే పోస్తా, అక్కర్లేదంటే మానేస్తా!" తెగేసి చెప్పి మరీ వెళ్లాడు.

సారథి మనసులో గుణించుకొన్నాడు. రోజూ లీటరున్నర పాలకుగాను రూపాయిన్నర చొప్పున నెలకు నలభైఐదు రూపాయిలు అదనపు భారం. ఎంతయినా తప్పని ఖర్చు కదా! పడకదిగి ఊసూరుమంటూ బాత్‌రూమ్ కేసి వెళ్లాడు.

చన్నీళ్ల స్నానానికి సారథికి వణుకొచ్చింది. బాత్‌రూమ్‌లో నుండి బయటికొస్తూనే, "అబ్బబ్బ! ముసురు రోజుల్లోనన్నా కాస్త వేణ్ణీళ్లు తగలేస్తే బాగుండేది కదా" అన్నాడు వణుకుతూ.

"ఎందుకు బాగుండదూ! మన స్నానాలకీ గ్యాస్ తగలేస్తే ఇరవైరోజులే సిలిండర్ వచ్చేది" అంటూ కస్సుమంది.

భార్య మాటలకు అంత చలిలోను వంట్లోంచి వేడి పుట్టుకొచ్చినట్లయి సారథి నోరెత్తలేదు.

"రిక్షావాడు వచ్చే నెలనుండి ఒక్కొక్కరికి పాతిక పెంచమన్నాడండీ".

తింటున్న టిఫిన్ గొంతుకి అడ్డం పడ్డట్టయింది సారథికి. ఇద్దరికీ కలిపి యాభైరూపాయలు అదనపు ఖర్చు!

"ఇప్పట్లో పెంచటం కుదరదని చెప్పకపోయావా?" భార్యతో అన్నాడు.

"చెప్తే, వేరే రిక్షావాణ్ణి చూసుకోమని ముందే చెప్పాడు" చెప్పింది.

"అలాగే మానెయ్యమను" అన్నమాట నోటిదాకా వచ్చింది. కాని గొంతు దాటలేదు. వాడికేం మారాజులా మానేస్తాడు... పిల్లల్ని స్కూలుకి ఎలా పంపటం, ఎలా తీసుకురావటం? మరో రిక్షావాడు మాత్రం అంతకు తక్కువడుగుతాడా?

'మధ్యతరగతివాడి కోపం మనశ్శాంతికి చేటు' అని నోరెత్తకుండా కోపం దిగమింగుకొంటూ 'ఇవ్వక ఏంచేస్తాం' అనుకున్నాడు.

ఆఫీసుకు బయల్దేరుతుంటే కావేరి చెప్పింది, పిల్లలిద్దరికీ టరమ్ ఫీజు చెల్లించమని నోటీసులు పంపారని.

"అదేంటి! పిల్లల స్కూళ్లు తెరిచి నాలుగు నెల్లన్నా కాలేదు. అప్పుడే టరమ్ ఫీజా?" అరిచాడు చిరాగ్గా.

"నన్నడిగితే నేనేం చెప్పను! ఆ ప్రశ్నేదో మీరెళ్లి స్కూలు వాళ్లనే అడగరాదూ" రెట్టించింది కావేరి.

ఆఫీసుకెళ్తూ దారి పొడుగునా స్కూలు ఫీజులగురించే ఆలోచన. ఫస్ట్ టరమ్కైన ఐదారు వేల ఖర్చు ఇంతవరకు సర్దుబాటు చేసుకోలేక పోయాడు. ఇంకా వెయ్యి రూపాయలు బాకీ అలాగే మిగిలింది. ఇంతలో మళ్లీ అప్పా!

కావేరికి చెప్తే విన్లేదు. గవర్నమెంట్ స్కూళ్లల్లో చేర్పిస్తే పనికి రాకుండా పోతారని ఇంగ్లీషు మీడియం కాన్వెంటులో వేసేదాకా వూరుకోలేదు. వేలకు వేలు ఖర్చు, ఇప్పుడే ఇంతవుతుంటే పైక్లాసులకి వెళ్లే కొద్దీ పెరిగే భారాన్ని మోసేదెలా?

ఆఫీసుకెళ్లాక సూపరింటెండెంట్ నుంచి పిలుపు.

"నెలనెలా వందరూపాయిలు పోస్టాఫీసులో ఆర్.డి. కట్టాలటయ్యా. లేకపోతే జీతాలబిల్లు పాస్ చెయ్యొద్దని ట్రెజరీకి కలెక్టర్గారి ఆజ్ఞట" చెప్పాడు సూపరింటెండెంట్.

సారథికి ఆవేశం ముంచుకొచ్చింది.

"జీతాల బిల్లుకి ఆర్.డి.కి లింకేమిటండీ? మన స్థోమతను బట్టి పొదుపు చేసుకొంటాం. ప్రొఫెషనల్ టాక్స్, గ్రూపు ఇన్సూరెన్స్, ఏ.పి.జి.యల్.ఐ, జి.పి.యఫ్.. ఇలా ఎన్నని కడ్తాం. అవనీ ఇవనీ జీతంలో నాలుగువ వంతు కోతలు పెడ్తుంటే ఎలా చస్తాం. ఆర్.డి. నేను కట్టలేను. జీతం ఎలా ఇవ్వరో చూస్తాను" ఆవేశంగా వచ్చి సీట్లో కూర్చొన్నాడు.

ఫైళ్లు ముందేసుకున్నాడన్న మాటేగాని చేస్తున్న పనిమీద మనస్సు లగ్నం కావటం లేదు.

ఆర్.డినే కట్టాలనేముంది? అంతకన్నా లాభసాటిగావుండే మరేదైనా ఎంచుకొంటాడు. ఆర్.డి. కట్టకపోతే జీతం ఇవ్వరా? తనమీద ఫిర్యాదు చేస్తారా? ఆఫీసంతా ఔనని తనొక్కడే కాదన్నందుకు తనమీద యాక్షన్ తీసుకొంటారా? పొదుపనేది తను ఇష్టపూర్వకంగా చేసేదీకాని బలవంతంగా చేయించేది కాదని, ఇలా జీతం ఆపటం అన్యాయమని కోర్టుకి

వెళ్తే! లాయరు, ఫీజు, సెలవులు అదో న్యూసెన్స్! ప్రభుత్వంవారి ఉప్పూ పులుసూ తింటూ వారిమీదే కోర్టుకెళ్లటమా? ఎడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్ అంటూ ఏదో వంకతో మారుమూల ప్రాంతాలకి బదిలీచేస్తే?

సారథి ఆవేశం పాల పొంగులా చల్లారింది. ఆ... లేనిపోని గొడవలెందుకు? ఇప్పుడు కాస్త కష్టమే అనిపించొచ్చు. అలా కడ్తూవుంటే ఏవో అవసరాలకి పనికొస్తుంది గదా! కాసేపాగి తనే వెళ్లి వందరూపాయిలిచ్చి దరఖాస్తు మీద సంతకాలు పెట్టి బుద్ధిగా సీట్లోకి వచ్చి కూర్చున్నాడు.

మధ్యాహ్నం సెక్షన్ ఆఫీసరుగారి గృహప్రవేశ ఆహ్వానాలు సెక్షన్‌లో అందరికీ అందాయి. అది చూస్తూనే సారథి మనస్సులో అలజడి.

ఇల్లు కట్టింది ఆఫీసరుగారు కనుక అందజెయ్యాల్సిన బహుమానం కూడా ఘనంగానే వుండాలి. రెండొందల లెక్కన ఒక్కొక్కరి దగ్గర జేబుపిండి వసూలు చేస్తారు. ఏదోరకంగా కూడబెట్టి ఇల్లు కట్టుకోగలిగిన వాడికి, ఆపాటి భాగ్యం లేని తనలాంటి నిర్భాగ్యులంతా చందాలేసుకొని ఈ బహుమానాలివ్వటం ఏమిటి?

అర్థంలేని ఫార్మాలిటీస్! చందా ఇవ్వను పొమ్మంటే పోలా! అయితే ఇచ్చిన వాళ్లూరు కొంటారా? ఆఫీసరుకు కొండీలు చెప్పరూ! అది మనస్సులో పెట్టుకొని ఆయన కుంటి సాకులతో వేధించుకు తినడూ? సెలవులు కావాలన్నా, ఫెస్టివల్ ఎడ్వాన్సిమ్మన్నా, లోనేమన్నా శాంక్షను చెయ్యాలన్నా కాదు కూడదంటూ మోకాలడ్డం పెట్టి దుంపతెంచడూ? రెండొందలు మనవి కాదనుకుంటే ఏ సమస్యా వుండదనుకున్నాడు సారథి.

లంచ్ అవర్లో, "నెలకు రెండువేల చొప్పున పాతిక నెలలకు యాభైవేలు చీటీ వేస్తున్నా, చేరతావా?" అంటూ దామోదరం పట్టుకున్నాడు.

"నెలకు రెండువేలా! నావల్లే మవుతుంది?" అన్నాడు సారథి.

"కాదనుకుంటే ఏదీ కాదోయ్! పది నెలల పాటు ఎటూ నలభై శాతం డివిడెండ్ గ్యారంటీగా వస్తుంది. నెట్ పన్నెండొందలేగా కట్టాల్సింది. ఆ తర్వాత క్రమేణా పెరుగుతుంది. అప్పటికి ఇంక్రిమెంట్‌లనీ, డి.ఎ.లనీ ఎయ్యోవకటి కలుస్తుంటాయిగా" సులువుగా చెప్పాడు.

ఆ చీటీ పాడుకొని ఇతరత్రా ఇన్వెస్ట్ చేసుకోగలిగితే ఎంత లాభదాయకమో కూడా ఏకరువు పెట్టాడు దామోదరం.

కావేరి ఎప్పట్నుండో గొడవ చేస్తూనే వుంది. టౌనుకొచ్చి పదేళ్లవుతున్నా చిన్న స్థలం కొనుక్కోలేకపోయాం అంటూ. భవిష్యత్తులో పెరిగే అవకాశాలున్న ప్రాంతంలో

తక్కువ ఖరీదుకు స్థలం కొంటే రిటైరయ్యేలోగా నాలుగు రాళ్లు వెనకేసుకొని చిన్న ఇల్లన్నా కట్టుకోవచ్చు. ఇబ్బందో సబ్బందో చీటీ కట్టాలన్న నిర్ణయానికొచ్చాడు.

టీ బ్రేక్‌లో పక్క సెక్షనులో పనిచేస్తున్న ధనుంజయ్ వచ్చాడు.

"సారథీ! రియల్ ఎస్టేట్ బిజినెస్ ప్రారంభించబోతున్నాం. ఐదెకరాల పొలం ఎక్స్‌టెన్షన్ ఏరియాలో చూశాం. ఎకరం లక్షన్నరకొస్తుంది. ప్లాటు ఖరీదు నెలనెలా వాయిదాల పద్ధతిలో కట్టించుకోవచ్చు. ఇరవై ఐదు నెలలయ్యేక రిజిస్ట్రేషన్ చెయ్యటం. నలుగురు వాటాదారులం". వివరించాడు ధనుంజయ్.

"పెట్టుబడి కింద లక్షపైనే కావాలి! అంత డబ్బు నా దగ్గరెక్కడిది?" అన్నాడు సారథి.

"పూర్తిగా స్వంత డబ్బుతో వ్యాపారం ఎవడోయ్ చేసేది? తలో యాభై వేలుంటే చాలు. అడ్వాన్స్ ఇచ్చి ఎగ్రిమెంట్ చేయిస్తాం. సభ్యులుగా చేరే వాళ్లు నెల నెలా చెల్లించే డబ్బు వుంటుందిగా. అది పూల్ చేసి మిగతాది రిజిస్ట్రేషన్ సమయంలో ఇచ్చేస్తాం. మన కష్టానికి తగ్గట్టు తలో ప్లాటు, లక్షరూపాయిలూ మిగులుద్ది". లెక్కలు వేసి చూపించాడు ధనుంజయ్.

గొర్రెతోక బెత్తెడేనన్నట్లు ఈ ఉద్యోగాన్నే నమ్ముకుంటే ఇంతకంటే జీవితంలో ఎదుగుదల వుండదు. వచ్చే జీతంరాళ్లతో జరుగుబాటుకి లోటు వుండదనేగాని సుఖపడిచచ్చేది ఏముంది! ఒక వ్యక్తి మాన మర్యాదలకు నేడు ఏపాటి విలువిస్తున్నారు! ఏరకంగా సంపాదిస్తేనేం, డబ్బున్న వాడికిచ్చే గౌరవం అది లేని వాడికిస్తున్నారా? లాభసాటిగా వుండే సైడ్ బిజినెస్ ఏదోటి తెగించి చెయ్యాలి. బాగా సంపాదించాలి.

ఆఫీసునుండి ఇల్లు చేరేవరకూ ఇదే ఆలోచన! చీటీ డబ్బుతో తనెటూ స్థలం కొనాలనుకుంటున్నాడు. చీటీ పాడితే ముప్పై వేలొస్తాయి. జి.పి.యఫ్.లోను పెడితే పది వేలొస్తాయి. మరో పదివేలకు కావేరి గాజులు, మావగారి పేర క్రాప్‌లోన్ పెట్టి తెప్పిస్తే సరి! మొత్తం యాభై వేలతో వాటా కలుస్తాడు. స్థలానికి స్థలమూ, లాభానికి లాభమూ వస్తుంది.

"మీ చిన్నన్నయ్య ఉత్తరం రాశాడు" కావేరి అన్నం వడ్డిస్తూ చెప్పింది.

"అంతా బాగున్నారా! ఏంటి విశేషాలు?" అడిగాడు కూర కలుపుతూ.

"ఏముంది! ఈ పదేళ్లబట్టి మీ అమ్మను పిల్లలకోసం కావాలని అట్టే పెట్టుకొన్నారు. ఇప్పుడు పిల్లలు ఎక్కొచ్చారు. మీ అమ్మకు వయసొచ్చి ఓపిక తగ్గిపోయాక అన్నివిధాలా దండగెందుకనుకున్నారేమో! మనకు అంటగట్టాలని చూస్తున్నట్లుంది". ఉత్తరంలోని సారాంశాన్ని విశ్లేషణాత్మకంగా చెప్పింది భార్య.

కన్నతల్లంటే సారథికీ ఇష్టమే! కాని ఈ రోజుల్లో ఒక మనిషిని పోషించటమంటే మాటలా! ఎంత అదనపు ఖర్చు! పెరుగుతున్న పిల్లలతో పాటు ఖర్చులూ ఇబ్బడిముబ్బడిగా పెరిగి తనూ సతమతమవుతున్నాడు. మొదట్నుండీ తనతోపాటు వుంటుంటే ఆ దారి వేరు. కన్నతల్లికి ఒక ముద్ద అన్నమే పెట్టలేనా అనుకోవటానికి, ఈ వయస్సులో రోగాలనీ రొష్టులనీ చూడాల్సినవి ఎన్నెన్నో వుంటాయి.

"అదే పనిగా బుర్ర బద్దలు కొట్టుకొంటున్నట్లున్నారు! మీరేం సమాధానం రాయకుండా ఊర్కోండి! అంతగా ఆయనేవస్తే అప్పుడే మావల్ల కాదని చెప్పొచ్చు. ఆమెచేత చాకిరీ చేయించుకొనేటప్పుడు తేలీదా; ఇంతకింత చెయ్యవలసిన బాధ్యత ముందుం టుందని?" అంటూ సారథికి నూరి పోసింది కావేరి.

సారథికి రాత్రి నిద్రలో కమ్మని కల!

సూట్‌కేస్ తెరిచాడు. దాని నిండా డబ్బు కట్టలు.

కావేరి ఆనందంతో సూట్‌కేస్‌ను ముద్దులు పెట్టుకొంటున్నది.

"ఈ డబ్బంతా ఎక్కడిదండీ! ఇదంతా మనదేనా?"

"అవునోయ్! బిజినెస్‌లో మనకొచ్చిన లాభం. అంతా మన సొంతమే!" కావేరిని కౌగిలిలోకి తీసుకొంటూ గర్వంగా చెప్పాడు.

"డాడీ ఈ కట్ట నాకు! సన్నీ కొనుక్కొని నేనూ, చెల్లీ రోజూ దానిమీద స్కూలుకెళ్తాం".

అంటూ పిల్లలిద్దరూ డబ్బుకట్టలు తీసుకొని పరుగులు పెట్టారు.

"మరి నీకేం కావాలోయ్?" అడిగాడు భార్యను.

"మంచి ఇల్లండీ!" చెప్పింది కావేరి.

కళ్లు మిరుమిట్లు గొలిపే రంగురంగుల విద్యుద్దీపాల అలంకరణతో మెరిసిపోతున్న అధునాతన గృహంముందు ఒక కారొచ్చి ఆగింది. అందులోనుండి సారథి, భార్యా, పిల్లలూ దిగారు. మంగళవాద్యాలు, మంత్రఘోషల మధ్య తాము కట్టుకున్న గృహంలోకి కుటుంబ సమేతంగా అడుగుపెట్టాడు.

బంధువులు, స్నేహితులు, చుట్టూచేరి కానుకలందిస్తూ అభినందనలతో సారథిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు.

ఇరవైనాలుగో గంటదాకా అతని స్వప్నం అలానే అప్రతిహతంగా సాగిపోతోంది. ఇరవైఐదో గంటలో అతని జీవితం మళ్లీ మొదలవుతుంది.

*(విపుల, జూన్ 1997)*